## క్లుప్తంగా

### నేడు సర్వసభ్య సమావేశం

**కడ్తాల్:** కడ్తాల్ మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యలయంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

### దర్గా ప్రహరీ నిర్మాణానికి మెటీరియల్ అందజేత

**తలకొండపల్లి:** మండల పరిధిలోని వెల్జాల్‌లో సుభానీ దర్గా ప్రహరీ నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనిచ్చారు. స్థానిక మైనార్టీ నాయకుల కోరిక మేరకు దర్గా ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం ట్రస్టు సభ్యులచే ఇసుక, సిమెంట్, ఇటుక తదితర నిర్మాణ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజీజ్, సయిద్, షకీల్, జాని, నయీం, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ హుండీ లెక్కింపు

**తలకొండపల్లి:** మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులు హుండీలో వేసిన కానుకలు, నగదును శుక్రవారం లెక్కించారు. ఆలయ ఈఓ మోహన్‌రావు, ఉప సర్పంచ్ రాజమోని తిరుపతి, ఆలయ నిర్వాహకులు ఆంజనేయుల సమక్షంలో హుండీని లెక్కించారు. హుండీ ఆదాయం రూ.82,362 వచ్చిందని వారు తెలిపారు. కార్యక్రమంలో లట్టుపల్లి మధు, కుమార్‌రెడ్డి, అంజనేయులు, వెంకటేశ్, కృష్ణ, మహేష్, హరికృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న మహేశ్

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణానాయక్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, కోశాధికారి రవి, సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో చేరండి

యూటీఎస్ మండల అధ్యక్షుడు అజ్మత్‌ఖాన్

**మంచాల:** పదవ తరగతి పాసైన విద్యార్థులు మంచాల ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాలని టీఎస్ యూటీఎస్ మండల అధ్యక్షుడు అజ్మత్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మంచాల జూనియర్ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఎల్‌టీ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ అంకితభావంతో పని చేసే సీనియర్ అధ్యాపక బృందం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తప్పక మంచాల జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు.

### మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి

జెడ్పీటీసీ నిత్యారెడ్డి



అనితారెడ్డినికి వినతిపత్రం ఇస్తున్న నిత్యారెడ్డి

**మంచాల:** మంచాల మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి ప్రభుత్వాని కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంచాల మండలంలో గిరిజన తండాలు అధికంగా ఉన్నాయన్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు కూడా ఐదు ఉన్నాయని పేర్కొన్నారు. నిధుల కొరత కారణంగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదన్నారు. మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

### పల్లె ప్రగతి పనుల పరిశీలన

**ఆమనగల్లు:** మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ రాఘవులు పల్లెప్రగతి పనులను పరిశీలించారు. నర్సరీని సందర్శించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డు, శ్మశానవాటికలను ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శి రమేశ్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె

- నిరవధిక సమ్మెకు దిగిన పంచాయతీ జూనియర్ కార్యదర్శులు
- అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్



ఆమనగల్లు: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

**ఆమనగల్లు:** తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టారు. ఉన్నతాధికారులకు ముందే ఇచ్చిన సమాచారం మేరకు ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగారు. నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలాన్ని పరిగణలోకి తీసుకుని రెగ్యులర్ చేయాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యదర్శులు గణేశ్, శివకుమార్, లక్ష్మణ్, శ్రీను, దేవేందర్, సురేందర్, సునీల్, రమేశ్, వినోద్, బాలమల్లేశ్ పాల్గొన్నారు.

**వెంటనే రెగ్యులరైజ్ చేయాలి..**

**కడ్తాల్:** విధుల్లో చేరి 4 సంవత్సరాలు పూర్తయినా నేటికి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు రమేశ్ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వారు నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెకు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, సర్పంచ్ తులసీరాంనాయక్ సంఘీభావం తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ .. తమ నియామకం జరిగి 4 సంవత్సరాలు పూర్తికావడం జరిగిందని.. ఇంతవరకు ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. జేపీఎస్‌లు రాజు, మహేశ్,రాఘవేందర్, రాణి, అశ్విని, రమాదేవి, హరీశ్,ప్రశాంత్, లింగారెడ్డి, రాఘవేందర్, ప్రసాద్, జగన్, జంగయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.

**మా ఆవేదన వినండి..**

**యాచారం:** కేసీఆర్ సార్ మా ఆవేదన వినండి.. మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి అంటూ యాచారం మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల క్రమబద్ధీరణ కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం యాచారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వారు సమ్మె నిర్వహించారు. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ సమ్మెలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గురుకుల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



**ఇబ్రహీంపట్నం:** గురుకుల ఉపాధ్యాయ, డీఎస్సీ ఉద్యోగాలకు సిద్ధమౌతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంకేఆర్ ఫౌండేషన్ అధినేత, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 9,811 గురుకుల ఉపాధ్యాయ, డిగ్రీ, జూనియర్ లెక్చరర్ల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించిందని తెలిపారు. ఆయా ఉద్యోగాలకు సంబంధించి ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా శిక్షణను అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాల యువతకు మేలు చేకూరాలనే సదుద్దేశ్యంతో ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30 నుంచి ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. త్వరలో వెలువడనున్న డీఎస్సీ కోసం సిద్ధమయ్యే అభ్యర్థులకు కూడా ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫౌండేషన్ చైర్మన్ మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ శిక్షణా శిబిరానికి తగు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ కార్యదర్శి జెర్కొని రాజు మొబైల్ నంబర్ 99485 55125కు కాల్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

# బీజేపీలో చేరిక



ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

**మంచాల:** మంచాల మండల పరిధిలోని ఆగాపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారిలో సాయిలు, అశోక్, సత్యనారాయణ, రాజు, పరమేష్, రమేష్, మధుకర్, దిలీప్, సాయి, కృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లచ్చిరెడ్డి, ప్రతాప్, నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌గౌడ్, జిల్లా నాయకులు దన్నె భాషయ్య, రాములు, మండల అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, నాయకులు పాల్గొన్నారు.

# కులసంఘాల బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

**యాచారం:** మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో వడ్డెర సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే నల్లవెల్లి గ్రామానికి చెందిన వడ్డెర సంఘం నాయకులకు నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను అందజేశారు. కుల సంఘాల ఆర్థిక ప్రగతి, కుల సంఘాల్లో చైతన్యం కోసం బీఆర్ఎస్ సర్కార్ ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు గండికోట యాదయ్య, ఓరుగంటి యాదయ్యగౌడ్, పాలకూర్ల లక్ష్మీపతిగౌడ్, కాసాని రవిగౌడ్, జంగయ్య, వెంకటేష్, పాండు, శ్రీను, సుధాకర్, నర్సింహ, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కడ్తాల్:** కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో కంటి వెలుగు, బస్తీ దవాఖానాలు, టీ డయాగ్నోస్టిక్స్, మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణంతో ప్రభుత్వం పేదవాడికి మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. వైద్యులే గ్రామాల్లోకి వచ్చి అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

**కేసీతండాలో కంటివెలుగు శిబిరం**

**యాచారం:** కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాచారం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ మౌనిక పేర్కొన్నారు. మండల పరిధిలోని కేసీతండాలో శుక్రవారం కంటివెలుగు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కేసీ తండాలోని గిరిజనులు కంటివెలుగు కేంద్రాలకు వచ్చి ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు అవసరమైనవారు కంటి అద్దాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారు, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కె ట్ కమిటీ డైరెక్టర్ శంకర్‌నాయక్, వైద్య సిబ్బంది సుగుణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



కడ్తాల్: కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# బీఆర్ఎస్‌తోనే రైతు సంక్షేమం

రైతుబంధు జిల్లా చైర్మన్ లక్ష్మారెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి

**మంచాల:** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరిధాన్యం విక్రయించాలని రైతుబంధు జిల్లా చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి అన్నారు. మంచాల, బోడకొండ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రైతు సంక్షేమంలో భాగంగానే వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా బోడకొండ గ్రామంలో మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పావని, సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, అలివేలు, ఎంపీటీసీ సభ్యుడు నరేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు వాజీద్, ఉప సర్పంచ్ భద్రీనాథ్ గుప్తా, నాయకులు శ్రీశైలం, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచ భద్రత దినోత్సవం

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ భద్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యదర్శి దేవేందర్, సిబ్బంది అల్లాజీ, పద్మాకర్‌రెడ్డి, మహేశ్, సురేశ్, ఉపేందర్, ముద్విన్ ఉపసర్పంచ్ వినోద్ పాల్గొన్నారు.


### కళాకారులకు ఆర్థికసాయం

**తలకొండపల్లి:** కళలను బతికించుకుందామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతారంలో శుక్రవారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఫౌండేషన్ సభ్యులచే రూ.10,000 నాటక కళాకారులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, గ్రామస్తులు, కళాకారులు పాల్గొన్నారు.

**స్నేహితుడి కూతురికి..**

**తలకొండపల్లి:** మండల పరిధిలోని చంద్రధనకు చెందిన నల్లబోలు తేజవర్ధన్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నది. తేజవర్ధన్‌తో పాటు 1986–87 సంవత్సరంలో పదోతరగతి చదివిన మిత్రులు మేము ఉన్నామంటూ ఆ కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. తమవంతుగా రూ.35,000 జమచేశారు. శుక్రవారం స్నేహితుడి(తేజవర్ధన్‌రెడ్డి) కూతురు పేరిట ఆ నగదును జమచేయించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రిపోర్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గోవిందాయిపల్లి తండాలో ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

**కడ్తాల్:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ రామునాయక్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్‌తో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించారు. కూలీలకు పనిచోట సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ అంజయ్య, ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, వార్డు సభ్యులు, నాయకులు భాస్కర్, నర్సింహ, వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, నర్సింగ్, సికిందర్,ఈదమయ్య, తదితరులు ఉన్నారు.

# బహిరంగ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

**ఆమనగల్లు:** ఈనెల 30న హైదరాబాద్‌లో డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. డీఎస్పీ వ్యవస్థాపకులు విశారదన్ మహరాజ్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగ సభ ఉంటుందన్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో డీఎస్పీ రాష్ట్ర నాయకులు శంకర్, జిల్లా కార్యదర్శి రమేశ్, నాయకులు శివప్రసాద్, సైదులు, రాజు, శ్రీను, రవి, మహేశ్, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి



కడ్తాల్‌లో భిక్షాటన చేస్తున్న వీఓఏలు

**కడ్తాల్:** ఐకేపీ వీఓఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం వీఓఏలు తమ డిమాండ్లకు సంబంధించిన వినతిపత్రాన్ని లక్ష్మీనర్సింహారెడ్డికి అందజేశారు. అలాగే వీఓఏల సమ్మెకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్ సేవ్యా సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు జానకీరాములు కార్యదర్శి వనిత, కోశాధికారి జంగయ్య, సభ్యులు బాలరాజ్, లక్ష్మీ, కవిత, అనసూయ, జంగయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

**తలకొండపల్లిలో..**

**తలకొండపల్లి:** ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు వినూత్న నిరసన చేపట్టారు. కిరాణ షాప్‌లు, హోటళ్లు, వస్త్ర దుకాణాలు, జిరాక్స్ సెంటర్‌లు తదితర వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి భిక్షాటన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య, వీఓఏలు.. కురుమయ్య, నర్సింహ, కల్పన, అరుణ, కృష్ణారెడ్డి, శ్రీవాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఆరు అంశాలకు ఆమోదం

చైర్‌పర్సన్ స్వప్న



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వప్న

**హయత్‌నగర్:** పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో ఏడు అంశాలకు గాను ఆరు అంశాలను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి తెలిపారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన శుక్రవారం తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో మున్సిపాలిటీ సాధారణ సమావేశం జరిగింది. గత సమావేశంలో చైర్‌పర్సన్ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య వాగ్వివాదాలు జరిగిన నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ హాజరై సమావేశాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కమిషనర్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'తెలంగాణ భరోసా' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నేతలు

**ఇబ్రహీంపట్నం:** తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్‌ను ఇబ్రహీంపట్నంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆ పార్టీ ఈసీ మెంబర్ బొల్ల గణేశ్, జిల్లా కార్యదర్శి పల్లాటి రాములు మాట్లాడుతూ.. మే 7న సాయంత్రం 4 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో తెలంగాణ భరోసా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసభకు మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి హాజరుకానున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు. యాదగిరి, దాసు, రఘుపతి, శాంతకుమార్, కృష్ణ, ప్రహ్లాద్, కరుణాకర్ పాల్గొన్నారు.

# ఘనంగా జలాలుద్దీన్ గంధోత్సవం

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో గురువారం రాత్రి హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ షావలి గంధోత్సవాన్ని మైనార్టీ నాయకులు, యువకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక జామా మసీదు వద్ద గంధోత్సవాన్ని జామా మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మాసూం ప్రారంభించారు. పట్టణంలోని జాతీయ రహదారి, వివిధ కాలనీల్లో గంధోత్సవం నిర్వహించారు. ర్యాలీలో పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇమామ్ మౌలానా అబ్దుల్ వాహేద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధోత్సవంలో వివిధ మసీదు కమిటీల అధ్యక్షులు మాసూం, గౌస్ మైనోద్దీన్, ఖాదర్‌ఖాద్రీ, స్థానిక నాయకులు అలీబేగ్, మహ్మద్ బేగ్, సయ్యద్ ఖలీల్, రజాక్, జబ్బార్, నయీం, మజీద్, ఖాదర్, జహంగీర్, సాజిద్, అలీం, అజీం, హఫీజ్, అన్వర్, జహీర్, ఇమ్రాన్, ఫిరోజ్, హైమద్, అఫ్సర్, జానీపాషా, ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.



గంధోత్సవంలో మైనార్టీ నాయకులు, యువకులు

# పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలి

బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



మృతుడు చిరంజీవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రంగారెడ్డి

**హస్తినాపురం:** ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న చిరంజీవిని పోలీసులు విచారణ పేరుతో చిత్రహింసలకు గురిచేయడం వల్లే మృతి చెందాడని రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. పోలీసులపై హత్య కేసు నమోదు చేసి మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీకి చెందిన చిరంజీవి(32)ని ఈనెల 25న సెల్‌ఫోన్ దొంగతనం కేసులో విచారణ కోసం నగరంలోని తుకారాంగేట్ పోలీసులు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేయడంతో మృతి చెందాడని, దీంతో అతడి కుటుంబం రోడ్డున పడిందని అన్నారు. పోలీసులు హత్య చేసిన చిరంజీవి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి చిరంజీవి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గజాల రాజుగౌడ్ ఎరుకల మల్లేశ్‌గౌడ్, మునిల్ నాయక్, కాటం శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.